క్లుప్తంగా

నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం



సత్యకాలనీ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కిర్లంపూడి: పల్లెల్లో నిరక్షరాస్యత నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా గనాంక సహాయకులు పోలిశెట్టి రాజేష్ తెలిపారు. జగపతినగరంలోని సత్యకాలనీలో అక్షరాంధ్ర సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ప్రస్తుతం సమాజంలో విద్య ప్రాముఖ్యతను వివరించారు. నూతన విద్యా విధానంపై అక్షరాంధ్రవాలంటీర్‌కు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సత్యప్రసాద్, ఎంఈఓ టి.జోసఫ్, ఏపీఎం వేదకుమారి, సీసీ లోవకుమార్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారని వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ అన్నారు. స్థానిక గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యుడు రాజీవ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల వ్యాప్తంగా పంచాయతీల్లో పని చేసే పారిశుధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడార్లు)కు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర కిట్లు అందజేసి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ బొప్పన రాము మాట్లాడుతూ కార్మికుల సేవలు వెల కట్టలేనివని కొనియాడారు. పల్లెలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతంనీడి అబ్బాయి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



తొండంగిలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

తొండంగి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో పంచాయతీ కార్మికులను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతకు కార్మికులు చేసే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్మికులందరికీ సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయి నవీన్, కూటమి పార్టీ నాయకులు యనమల రాజేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దళితులపై పెరుగుతున్న దాడులు

గోకవరం: కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు బుధవారం ఓ ప్రకటనలో అన్నారు. కోరుకొండ మండలం గాదాల ప్రధాన కూడలిలో ప్రజలు చూస్తుండగా దళిత యువకుడిని స్తంభానికి కట్టి అగ్రకులస్తులు దాడి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితుల ప్రాణాలకు పూర్తిగా రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సంఘటన తీరు చూస్తే రాబోయే రోజుల్లో మరింత అరాచకాలు పెరగడానికి అవకాశముందన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిని ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులందరినీ తక్షణమే అరెస్టు చేసి బాధితులకు ప్రాణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

యమపాశాల్లా..

- వర్షాకాలంలో విద్యుత్ ఉపకరణలతో ప్రమాదం
- రైతన్నలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి



పొలంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ బోరు

ప్రత్తిపాడు: ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు విద్యుత్తు ఉపకరణాలు వినియోగిస్తాం. ఇంట్లో దీపం వెలగాలన్నా..పొలంలో పంటకు నీరు కావాలన్నా విద్యుత్ అవసరం. కరెంటు తీగలు రైతన్నలు, పశువులు పాలిట యమపాశాంలా మారుతున్నాయి. అసలే వర్షాకాలం ఇంటా..బయట విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలి, వైర్లు తెగిపడడం వంటివి సాధరణంగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా ఉండవచ్చని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మరమ్మతులపై అశ్రద్ధ

బోర్ల కింద సాగు చేపట్టే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి. పొలంలో వేయించిన బోరు తాలూకు మోటార్లు, తీగలు ఎలా ఉన్నాయో పరిశీలించుకోవల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ అధికారులు సలహాలు అందిస్తున్నారు. ఎక్కువ మంది రైతులు చిన్నచిన్న మరమ్మతుల పట్ల అశ్రద్ధ చేస్తుంటారు. అవే ఒక్కోసారి ప్రాణాలు మీదకు తీసుకువస్తుంది. పొలాల్లో కరెంట్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగల విషయంలో ఏ చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

తెగిన తీగలతో..

గాలి వానల సమయంలో ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు గాలి వానలకు తెగిపడుతూ ఉంటాయి. వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలను తీసుకువచ్చి ఇళ్లలో తీగలను కట్టకట్టి దాస్తుంటారు. ఆ సమయంలో ఆ తీగలను పాడైపోయినా గమనించకుండా తీసుకెళ్లి వాటిని మోటార్లకు బిగించడం వలన, రైతులు, కూలీలు తీగలున్న ప్రాంతాల్లో తిరిగి కాలికి తగిలితే షాక్‌కు గురై మృతిచెందే అవకాశం ఉంది.

కవర్లు లేని మోటార్లతో..

రైతులు తక్కువ ధరలకు మోటార్లను కొనుగోలు చేసి వాడుతుంటారు. కొందరు మోటార్లను ఆరుబయట, బావి ఒడ్డు, కాల్వ ఒడ్డున ఉంచి, చిన్న కవర్లను కప్పుతుంటారు. కొన్ని రోజులకు అవి దెబ్బతినడం, తరువాత వాటిని పట్టించుకోకపోవడంతో మోటార్లు తడిసిపోతాయి. దీంతో విద్యుత్ సరఫరా కావడంతో స్విచ్ ఆన్ చేసే సమయంలో షాక్ కొట్టి ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

ఇనుప డబ్బాలతో ప్రమాదం..

చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్లు, ఫీజులు బిగింపు కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తుంటారు. ఈక్రమంలో ఎలుకలు అందులోకి వెళ్లి తీగలను కొరికేయడం వలన డబ్బాలకు తీగలు అంటుకుని విద్యుత్ ప్రవహించి పట్టుకోగానే షాక్ కొట్టే ప్రమాదం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పొలాల్లో విద్యుత్ పనిచేయకుంటే టెస్టర్ సాయంతో పరిశీలించాలి.
- వర్షం నీరు తగలనిచోట మోటార్లను అమర్చుకోవాలి.
- ప్రతీ మోటారుకు ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలి.
- మరమ్మతుల సమయంలో సరఫరాను నిలిపివేయాలి.
- స్టార్టర్లను పొడి ప్రదేశంలో మోటారుకు దగ్గర ప్రదేశంలో అమర్చుకోవాలి.
- రక్షణ కవర్‌లను తీసివేయకూడదు.
- నేరుగా స్టార్టర్లకు సరఫరా కాకుండా ఫీజు ఏర్పాటు చేసుకోవాలి
- నిపుణులతో పని చేయించుకోవాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..



వర్షాకాలంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి. వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దు. కరెంట్ వైర్లను తాకుతున్న చెట్లను ముట్టుకోవద్దు. పొలాల్లో స్టార్టర్లను మరమ్మతులు చేయించుకోవాలి. లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలను తీసుకుని అప్రమత్తంగా ఉండడం వల్ల ప్రమాదాలను నివారించుకోవచ్చు.

– ఎ శ్రీను, అసిస్టెంట్ ఇంజినీర్, విద్యుత్‌శాఖ, ప్రత్తిపాడు

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జేసీబీని ప్రారంభిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ఉపాధి అవకాశాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పార్టీ కార్యకర్త సికోలు మురళీ మోహన్ కొనుగోలు చేసిన నూతన జేసీబీని మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఎల్లో గ్యాంగ్ తప్పుడు ప్రచారం చేసిందని, మద్యం అక్రమ కేసులో త్వరలోనే ఒక్కో నిజం వెలుగులోకి వస్తుందని, కూటమి ప్రభుత్వం అప్రతిష్టపాలవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామరాజు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, జువ్వల రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు-ఆటో ఢీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి శరభవరం గ్రామాల మధ్య బుధవారం ఆర్టీసీ బస్సు – ఆటో ఢీకొన్నాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు నుంచి శాంతి ఆశ్రమం వెళుతున్న ఆర్టీసీ బస్సు శరభరం నుంచి ఒమ్మంగి వైపు వస్తున్న ఆటోని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

దేవుళ్ల మాస్టారుకి అవార్డు ప్రదానం



దేవుళ్లు మాస్టారుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన చింతకాయల దేవుళ్లు (దేవుళ్ల మాస్టారు) ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను ప్రోత్సహించేందుకు గుంటూరుకు ఏరువాక ఫౌండేషన్ అవార్డుల ప్రదానం చేస్తుంది. 2024 సంవత్సరానికి సంబంధించి సేంద్రీయ విధానంలో వరిసాగులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతు దేవుళ్ల మాస్టారును ఎంపిక చేసింది. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఏరువాక ఫౌండేషన్ ప్రతినిధులు మాస్టారును సాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. అవార్డు గ్రహీత దేవుళ్లు మాస్టారుకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే



సీనియర్ పెన్షనర్స్‌ను సత్కరిస్తున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: వృద్ధాప్యంలో తల్లితండ్రులను చూడవలసిన బాధ్యత వారి పిల్లలకు కచ్చితంగా ఉంటుందని, దీనికి విరుద్ధంగా అమానుషంగా ప్రవర్తించే పిల్లలు శిక్షార్హులని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేటలోని పెన్షనర్స్ భవనంలో వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వృద్ధుల హక్కులను వివరించారు. అనంతరం 8 మంది రిటైర్డు ఉద్యోగులను సత్కరించారు. 50 మంది వృద్ధులకు, అనాధలకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు, పళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు, సీనియర్ పెన్షనర్స్ రెడ్డి సుబ్బారాయుడు, డ్రిల్‌మాస్టర్ లక్ష్మి నారాయణ, సంఘం నేతలు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

ఏలేశ్వరం: మండల పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉడత రామచంద్రరావు అధ్యక్షతన సీనియర్ సిటిజన్ ఉద్దగిరి సోమరాజుతో పలువురిని సన్మానించారు. అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ తరతరాలను చవిచూసిన వృద్ధుల సలహాలు, సూచనలు మనకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎబివిప్రసాద్, విశ్వనాథం, జహీరుద్దీన్, ఇబ్రంహీమ్‌ఖాన్, అస్మాండ్, జోగిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కరప: బాణసంచా తయారీదారులు నిబంధనలు అతిక్రమించి మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కరప ఎస్సై టి.సునీత, ఆర్ఐ పవన్‌తో కల్సి ఆయన మండలంలోని వేళంగి, గొర్రిపూడి, నడకుదురు గ్రామాల్లోని బాణసంచా తయారీకేంద్రాలను బుధవారం తనఖీ చేశారు. బాణసంచా తయారీదారులు భద్రతా నియమాలు పాటించాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, అనుమతి లేకుండా బాణసంచా తయారు చేయడం, నిల్వ ఉంచడం చేయరాదన్నారు.కేంద్రం వద్ద ఇసుక, నీరు, అగ్నిమాపక యంత్రపరికరం అందుబాటులో ఉంచాలన్నారు. మహిళలు, చిన్నారులతో బాణసంచా తయారు చేయించరాదన్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటిపన్నుల చెల్లింపులు

కరప: ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను చెల్లించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

రాజరాజేశ్వరీ రక్షమాం



ఏలేశ్వరంలో సారెతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



ఏలేశ్వరంలో దశమికి ముస్తాబైనా అమ్మవారి ఆలయం

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం మహిషసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు. బుధవారం దుర్గా నవమిని పురస్కరించుకుని అమ్మవారి మహిషసురమర్దనిగా అలంకరించారు. దుష్టుడైన మహిషాసురిడిని అంతమొందించిన భీకర శక్తి స్వరూపణి మహిషాసురం మర్దని అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటే.. శత్రు భయం ఉండదని భక్తుల విశ్వాసం. మహిషాసురవర్దని అవతారం శక్తి, ధైర్యం, న్యాయం, ధర్మ పరిరక్షణలకు సంకేతంగా నిలుస్తుందని భావం. స్థానిక తోటవీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, నర్సీపట్నం రోడ్, మార్కెట్‌వీధి తదితర ప్రాంతాల్లో అమ్మవారికి మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో మహిళలు అమ్మవారికి సమర్పించే సారెతో ఊరేగింపు నిర్వహించారు.

దశమికి ముస్తాబవుతున్న ఆలయాలు

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవ రాత్రల్లో విశిష్టమైన విజయదశమిని గురువారం వైభవంగా నిర్వహించేందుకు నియోజకవర్గవ్యాప్తంగా అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు. విజయదశమి పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి ఆలయం వద్ద దశమికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని తోటవీధిలో వేంచేసియున్న అమ్మవారి ఆలయం విశిష్టత సంతరించుకుంది. 1983 నుంచి తోటవీధిలో దశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈఏడాది తోటవీధిలో 42 ఏళ్ల ఉత్సవాలు పూర్తిచేసుకున్నాయి. స్థానిక నర్సీపట్నంరోడ్, ఆర్టీసీ కాంప్లెక్స్, సువ్వయ్యమ్మపేట, లింగంపర్తిలోని సుబ్బారావుకాలనీ, సత్రంపంపుకాలనీలో దశమి ఏర్పాట్లు చేస్తున్నారు. విజయదశమి పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసియున్న బాలా త్రిపుర సుందరి అమ్మవారిని బుధవారం మహిషాసురమర్దినిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వీఎస్ఎన్ మూర్తి, ఆలయ బ్రహ్మ వెలవలపల్లి శ్రీవర్ధన్ శివాచార్య ప్రత్యేక పూజలు గావించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మహిషాసురమర్దినిగా అపీత కుచాంబా

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం దుర్గాదేవి మహిషాసురమర్దిని దేవి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపీత కుచాంబా, ధర్మవరం సూర్యరావుపేటలో కనక దుర్గమ్మ, ఒమ్మంగి విజయదుర్గ అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. మండలంలోని ధర్మవరం, పెద్దిపాలెం, ఉత్తరకంచి, రాచపల్లి, శరభవరం, గజ్జనపూడి, పోతులూరు, తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో అర్చకులు, అమ్మవారికి అలంకార పూజలు, కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ముద్రగడ కుటుంబం పూజలు



కిర్లంపూడిలోని నూకాలమ్మను దర్శించుకుంటున్న ముద్రగడ కుటుంబ సభ్యులు

కిర్లంపూడి: శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని కిర్లంపూడిలో మాజీ మంత్రి, పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం కులవేల్పు అయిన నూకాలమ్మ మహిషాసురమర్దని దేవి అవతారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ముద్రగడ సీతాపతిరావు, శామల దంపతులు అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ నాయుడు, రాజా, సత్యంబాబు, బుజేంద్ర తదితరులు పాల్గొన్నారు. జగపతినగరం అభయ దుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ, వనదుర్గమ్మ, చిల్లంగి, వీరవరం, రామచంద్రపురం గ్రామాల్లో వేంచేసి ఉన్న కనక దుర్గమ్మ మహిషాసుర మర్దని దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించారు.

మహిషాశురమర్ధనిగా రత్నగిరి వనదుర్గ, కనకదుర్గ

తొండంగి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రత్నగిరి వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు మహిషాశురమర్దిని అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. రత్నగిరి కొండపై ప్రధానాలయంలో అనంతలక్ష్మి సత్యవతీదేవికి అర్చకులు, రుత్వికులు వేదమంతోచ్ఛారణతో ప్రత్యేక పూజలు చేశారు. కొండపై మెట్ల మార్గంలో ఉన్న వనదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, కొండదిగువ తొలిపావంచాల వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయంలోనూ అమ్మవార్లను మహిషాశుమర్దినిగా అలంకరణ చేయగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. రుత్వికులు లక్ష కుంకుమార్చన, మహదాశీర్వచనం, వేద స్వస్తి వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. దసరా సెలవుల నేపథ్యంలో రత్నగిరి భక్తులతో కిటకిటలాడింది.

మహిషాసురమర్దినిగా లోవ తలుపులమ్మ

తుని రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం లోవదేవస్థానంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శినమిచ్చారు. వేద పండితులు అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి కుంకుమపూజలు, హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిషాసురమర్దినిగా దేవిచౌక్ అమ్మవారు

గోకవరం: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో 10వ రోజు శ్రీమహిషాసురమర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ, శ్రీనివాస్‌శర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి మహిషాసురమర్దినిదేవి అలంకారంలో కనకదుర్గమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా దేవి నవరాత్ర వేడుకలు

జగ్గంపేట: జగ్గంపేట శివారు సీతానగరంలోని ఏగులమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏగులమ్మ అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కాట్రావులపల్లిలోని గ్రామ దేవత వేగులమ్మ వారి ఆలయంలోను దేవి నవరాత్రులు సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి బోనాలు సమర్పణ

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో వేంచేసియున్న శ్రీ దుర్గా పరమేశ్వరి అమ్మవారు శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగాంగా బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆలయ ధర్మకర్త లాలం బాబ్జి ఆధ్వర్యంలో వందలాదిగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వేదపండితులు అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.




మహిషాశురమర్ధని అలంకరణలో కనకదుర్గ అమ్మవారు




మహిషాశురమర్దిని అలంకరణలో వనదుర్గ అమ్మవారు



శ్రీమహిషాసురమర్దిని దేవిగా దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ



మహిషాసురమర్దినిగా దర్శనమిస్తున్న లోవ తలుపులమ్మ తల్లి



మహిషాసురమర్దిని దేవిగా దర్శనమిచ్చిన అపీత కుచాంబా



కేఈ చిన్నయ్యపాలెంలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు